క్లుప్తంగా

దుర్గగుడికి కానుకగా వాటర్ కూలర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిలో దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులు చల్లటి మంచినీటిని అందించేందుకు అవసరమైన కూలర్‌ను పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య గురువారం దేవస్థానానికి అందచేశారు. సుమారు రూ. 10 వేల విలువైన వాటర్ కూలర్‌ను దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్య చేతుల మీదగా ఆలయ అధికారులకు అందచేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వాటర్‌కూలర్‌ను అందుబాటులో ఉంచాలని కట్టా సత్తెయ్య ఆలయ అధికారులను కోరారు.

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం దోహదం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే వివిధ పోషకాలతో కూడిన బాలామృతాన్ని తల్లులు తీసుకొని పిల్లలకు వాడాలని, అది వారి ఎదుగుదలకు దోహదం చేస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్–1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం విద్యాధరపురం రావిచెట్టు సెంటర్–1 అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం వినియోగంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్ బి–12 వంటి పోషక పదార్థాలతో కూడిన బాలామృతాన్ని 7 నెలల నుంచి 3 ఏళ్ల వయసుగల పిల్లలకు పెట్టాలని సూచించారు. అలాగే పిల్లల బరువు, ఎత్తు ఎప్పటికప్పుడు చూసుకుంటుండాలని చెప్పారు. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని పక్షంలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాలామృతంతో తయారు చేసిన వంటకాలను పిల్లలకు ఏ విధంగా వాడాలో తల్లులకు సూచించారు.

పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమైందని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. కొండ ప్రాంతంలో సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన పైప్‌లైన్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కొండ ప్రాంతంలో సుమారు 600 మీటర్ల నూతన మంచినీటి పైపులైను పనులను చేపడుతున్నామన్నారు. గతంలో రూ.30 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేశామన్నారు. తాజాగా మరో రూ.20 లక్షల పనులను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. డివిజన్‌లో అనేక దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లు దెబ్బతినటంతో వాటి స్థానంలో కొత్తవి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఎంసీ వాటర్ సెక్షన్ ఏఈ అహ్మద్, స్థానిక సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోలీసుల కవాతు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, పోలీసులు తోడుంటారని భరోసా కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో గురువారం నున్న పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేంద్ర పారా మిలటరీ సాయుధ దళాలతో కవాతు నిర్వహించారు. నున్న పోలీసు స్టేషన్ పరిధి లో కండ్రిక, రాజీవ్ నగర్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో పోలీసు కవాతు జరిగింది. రాబోయే ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కల్గకుండా సామాన్యుడు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసులు చేపడుతున్న వివిధ రకాల ప్రణాళికలో భాగంగానే ఈ కేంద్ర సాయుధ బలగాల కవాతు నిర్వహించామని సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు.

ఘనంగా శ్రీకోటయ్యస్వామి ఉరుసు మహోత్సవం



గన్నవరం: స్థానిక కొత్తపేటలోని శ్రీకోటయ్య స్వామి ఆలయంలో గురువారం 13వ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకోటయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గన్నవరంతో పాటు పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలోని లడ్డూ ప్రసాదాన్ని వీసం సాంబశివరావు, మాణిక్యదేవి దంపతులు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2,500 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణబలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు మొవ్వ నాగబాబు, గౌరవాధ్యక్షుడు వీసం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వీసం నాగబాబు, సంఘం నేతలు అత్తులూరు కొండలరావు, మల్లికార్జునరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పేదలకు చేసింది శూన్యం

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్.ఆసీఫ్



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసీఫ్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రంలో పేదలకు చేసింది శూన్యమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్.ఆసీఫ్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గురువారం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 56వ డివిజన్ కార్పొరేటర్ యలకల చలపతిరావుతో కలిసి పాత రాజరాజేశ్వరి పేటలో పర్యటించారు. డివిజన్‌లోని మసీదు వీధి, మెయిన్‌రోడ్డు, జుడీషియల్ కాలనీ వీధుల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించటమే కాకుండా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత అధికారులకు తెలియచేసి వెంటనే పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పాత ఆర్ ఆర్‌పేట పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయల నిధులతో డివిజన్‌లో సీసీ రోడ్లు నిర్మించటంతో పాటు ఎన్నో ఏళ్లుగా స్థానికులకు కలగా మిగిలిన తాగునీటి సరఫరాకు నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తున్నారని వెల్లడించారు. పిల్లలను చదివించలేని తల్లిదండ్రులకు అమ్మఒడి ద్వారా అండగా నిలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేని ప్రతి పక్షాలు వచ్చే ఎన్నికల్లో గెలవలేమని తెలుసుకొని పొత్తులతో ముందుకు వస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని పొత్తులతో వచ్చినా ప్రజలు తిరిగి జగనన్నను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రబ్బానీ, నాయకులు వాసా బాబు, గురునాయుడు, గొలగానీ శ్రీను, నాగపావని, స్రవంతి, మున్ని, అబ్దుల్ కరీమ్, పొలిమెట్ల శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఆర్ సెంటర్ ప్రారంభానికి సిద్ధం చేయండి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దిన ట్రిబుల్ ఆర్ నాలెడ్జ్ సెంటర్‌ను అతి త్వరలో ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వ్యర్థ నిర్వహణలో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తూ జ్ఞానాన్ని పెంచేందుకు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో గల నిర్మిస్తున్న ట్రిబుల్ ఆర్ సెంటర్‌ను ఆయన గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో నిర్మిస్తున్న ట్రిబుల్ ఆర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. నగరానికి మరింత మెరుగులు దిద్దటమే కాకుండా నగర ప్రజల్లో వ్యర్థ నిర్వహణ గురించి అవగాహన కల్పించే త్రీడీ సూక్ష్మ నమూనాలు, అవి పని చేసే విధానాన్ని ఈ సెంటర్‌లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నగరంలోని వ్యర్థాలను సేకరించి ఇక్కడ డంప్ చేసే ప్రాంతమైనప్పటికీ ఎంతో సుందరంగా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించచటంతోపాటు కాలుష్యాన్ని తగ్గించే అందమైన మొక్కలను నాటి ప్రజలను ఆకట్టుకునే విధంగా ట్రిబుల్ ఆర్ సెంటర్‌ను తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయనతోపాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పార్క్స్) ఎఎస్ఎన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై చైర్మన్ సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అభివృద్ధి పనులపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్షించారు. మహా మండపం 7వ అంతస్తులోని చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయం తుది పనులు, యాగశాల, పూజా మండపాల పనులతో పాటు లడ్డూ, అన్నదానం, క్యూలైన్ల పనుల గురించి చర్చించారు. పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించడంతో పాటు దసరా నాటికి పూర్తి చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థినికి వినికిడి యంత్రం అందజేత



వినికిడి యంత్రాన్ని అందచేస్తున్న యలమంచిలి జయప్రకాష్, ట్రస్ట్ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సహాయం అవసరమైన వారికి చేయడంలోనే నిజమైన ఆనందంగా ఉంటుందని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జ్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. గిరిపురంలో నివాసం ఉంటున్న కంభంపాటి కిషోర్ కుమార్తె యశ్విత (15) పదో తరగతి విద్యార్థినికి రూ.18 వేలు విలువ గల వినికిడి యంత్రాన్ని వైఎన్నార్ చారిటీస్ ద్వారా కొనుగోలు చేసి యశ్వితకు సంజీవని ఆసుపత్రి ఆవరణలో గురువారం ఉచితంగా అందచేశారు. సంజీవని ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ చింతల వెంకటరాజేష్, చావా రఘు, శివతో పాటుగా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. యలమంచిలి జయప్రకాష్ మాట్లాడుతూ తరగతి గదిలో పాఠాలు వినే సమయంలో యశ్విత చాలా ఇబ్బంది పడుతుందని కుటుంబసభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి ఆమెకు అవసరమైన వినికిడి యంత్రాన్ని తమ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందచేస్తున్నామన్నారు. సహాయం అవసరమైన వారికి అందించడంతో తమ ట్రస్ట్, వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడు ముందుంటుదన్నారు.

ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్ర అన్నారు. కొండపల్లిలో ఎస్టీల ఆత్మీయ సమావేశంలో జిల్లా డైరెక్టర్ జె.సునీతతో కలిసి ఆయన గురువారం పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఆదరించిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్రకొండ గురవయ్య, 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ స్థానిక సమస్యలు ఆయనకు వివరించారు. ఎస్టీ కాలనీలో మురుగు నీరు పారుదలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అడ్డుగా ఉన్న నిబంధన తొలగించాలని కోరారు. ఈసందర్భంగా నాయకులు సురేంద్రను అభినందించారు.

రాష్ట్రంలో ఆలయాలకు పూర్వ వైభవం



కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాగణంలో నూతనంగా నిర్మాణం పూర్తిచేసుకున్న కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపాన్ని సెంట్రల్, పశ్చిమ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ముందుగా వారు ఆలయంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషిచేస్తున్నారని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రాంతంగా విరాజిల్లుతున్న సత్యనారాయణపురంలో గత పాలకుల నిర్లక్ష్యంతో దేవాలయాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో పురాతన, శిథిలావస్థకు చేరుకున్న అనేక దేవాలయాలకు పూర్వవైభవం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇటీవలే సత్యనారాయణపురంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం, గవర్నరుపేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ దేవస్థానం ఆధునికీకరించినట్లు తెలిపారు. హిందూ ధర్మాన్ని కాపాడుతూ దేవాలయాల వ్యవస్థను ఎల్లవేళలా పరిరక్షిస్తూ ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముక్కంటి దేవతల ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు మైలవరపు రామకృష్ణ, కొల్లూరు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు శ్రీనివాసరావు, కోశాధికారి దేవకి శివసురేంద్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ సిబ్బందికి నూతన వస్త్రాల బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక గుండారపు సోమయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బందికి నూతన వస్త్రాల బహూకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ట్రస్ట్ సేవా కార్యక్రమంలో భాగంగా పేద వ్యక్తులకు ఇస్త్రీ బండి, రెండు టిఫిన్ బండ్లు అందచేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ తన తండ్రి సోమయ్య పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది శానిటరీ సిబ్బందికి కొత్త దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలకు వెల కట్టలేమని చెప్పారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఫ్రంట్ వారియర్స్‌గా నిలిచి వారు చేసిన సేవలు ఎవరూ మరిచిపోలేరని కొనియాడారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పేదలకు సేవలు అందించటమే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు వెళుతుందన్నారు.

పేద ప్రజల ఆరోగ్య రక్షణకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన దుర్గారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల ఆరోగ్య రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలను తీసుకు వచ్చారని, అందులో భాగంగానే గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేసిందని గొల్లపూడి పంచాయతీ ఎంపీటీసీ నంద్యాల దుర్గారావు పేర్కొన్నారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని పోలేరమ్మ గుడి సమీపంలో గల రామరాజ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (వెల్‌నెస్) – 4 కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఈ వెల్‌నెస్ సెంటర్‌లో పేద ప్రజలకు వివిధ రక్తపరీక్షలు నిర్వహించటం, రోగ నిర్ధారణ చేసి మందులను అందజేస్తారన్నారు. అత్యవసరమైన వైద్య చికిత్స కోసం ఇక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేస్తారని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో మూడు వేలకుపైగా ప్రొసీడింగ్స్‌ను చేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రామరాజ్యనగర్ ప్రజలతో పాటు చుట్టుపక్కల ఉన్న పేద ప్రజలు ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది, సచివాలయ హెల్త్ సెక్రటరీ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా జగనన్న

మంత్రి జోగి రమేష్

పెనమలూరు: నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పెనమలూరు సెంటర్‌లో గురువారం నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని తెలియజేస్తూ నాయీబ్రాహ్మణ సంఘం నేతలు ముద్రించిన కరపత్రాలను మంత్రి విడుదల చేసి ప్రసంగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యులుగా నాయీబ్రాహ్మణులకు జగనన్న ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కులదూషణ, ఇతర హక్కులపై ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసిందని అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా నాయీ బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు, నేతలు ఆకునూరు సుబ్బారావు, తెన్నేటి ప్రకాష్, అయోధ్య సత్యనారాయణ, చాగంటిపాటి శివరామకృష్ణ, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, పార్టీ నేతలు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి, దేవభక్తుని సుబ్బారావు, రాయవరపు గణపతి, మున్నంగి కిరణ్‌కుమార్, సాంబశివరావు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న సుధాకర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పరిశ్రమల స్థాపనకు దృష్టి సారించాలని జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం సుధాకర్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగం ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్ సౌజన్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎవరెనెస్ కార్యక్రమంలో భాగంగా ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమల స్థాపనకు విస్తృతమైన అవకాశాలు ఎదురు చూస్తున్నాయన్నారు. సృజనాత్మకత, అవగాహనతో ముందుకు వచ్చే యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆ దిశగా ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం నుంచి అనేక సదుపాయాలు, ప్రోత్సాహకాలు సైతం లభిస్తాయని వివరించారు. విద్యార్థులు నూతన అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ సెంటర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్ఎల్ఎన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపన ద్వారా దేశాభ్యున్నతికి సైతం అండగా నిలిచిన వారవుతారని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి కోసం కాకుండా వాటిని సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి హేమంత్‌కుమార్ నిర్వహించారు.

కిడ్నీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ శౌరిబాల



మాట్లాడుతున్న డాక్టర్ శౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కిడ్నీ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ శౌరిబాల తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా సన్‌రైజ్ హాస్పటల్ సౌజన్యంతో గురువారం రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో కిడ్నీ వ్యాధిపై అవగాహన, వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శౌరిబాల కిడ్నీ వ్యాధి లక్షణాలు, చికిత్స, వాటి నివారణ గురించి రోగులకు వివరించారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోజూ కూరగాయలు, పీచు పదార్థాలు, నీరు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం ఈ శిబిరంలో పాల్గొన్న 90 మంది రోగులకు బ్లడ్ టెస్టులు, డయాబెటిక్, హైపర్ టెన్షన్, పెద్ద వయసు రోగుల కోసం సీరం యూరిక్ యాసిడ్ టెస్టులు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎమ్ఎస్‌లు డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ రవికాంత్, సన్‌రైజ్ హాస్పటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎమ్.వి సాయికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్ శంకరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీ ఎస్పీఎఫ్) విజయవాడ యూనిట్ అధికారులు, సిబ్బందికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వద్ద కార్యాలయంలో ఏపీఎస్పీఎఫ్ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ, ఐజి రామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఈ వైద్య శిబిరం నిర్వహించారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు పాల్గొని 245 మంది సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీఎఫ్ కమాండెంట్ ఎం.శంకర్‌రావు మాట్లాడుతూ సిబ్బందికి కంటి సమస్యలు ఉంటే తెలుసుకుని వైద్య పరీక్షలు చేయించాలనే ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. విజయవాడ యూనిట్ అసిస్టెంట్ కమాండ్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. అలాగే పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు, ఎస్ఐ ఫణి కుమార్, ఏఎస్ఐ భాను ప్రకాష్ రెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



విద్యార్థినులకు క్రీడా పరికరాలు అందిస్తున్న బీఐఎస్ అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు, యువత వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ బ్రాంచి అసిస్టెంట్ డైరెక్టర్ దరూర్ అఖిల్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పటమటలోని కోనూరు బసవపున్నయ్య జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు మనక్ మహోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా సురక్షితమైన నాణ్యమైన వస్తువులను అందించడం, ఎగుమతులు, దిగుమతుల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, హాల్ మార్కింగ్ స్టాండరైజేషన్, సర్టిఫికేషన్ టెస్టింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దరూర్ అఖిల్ ప్రమాణాల ప్రాముఖ్యత గురించి యువతకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు అల్ట్రాటెక్ సిమెంట్స్, ఏబీజీ గ్రూప్స్ నుంచి వివిధ క్రీడా వస్తువులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిమెంట్స్ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జయదీప్, సీతారెడ్డి, రవికుమార్, పి చిట్టిబాబు, జయదీప్, అశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



గంపలగూడెంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో 24 గంటల పీహెచ్‌సీలు పనితీరును తెలుసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం రాత్రి మూడు పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, సేవలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాత్రి 10.10 గంటల సమయంలో పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అటెండెన్స్ రిజిష్టర్ చూశారు. అనంతరం రాత్రి 10.50 గంటలకు ఏ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇడీడీ క్యాలెండర్, డెలివరీ రూమ్ సౌకర్యాలు, మందులు అందుబాటు వంటి వాటిని పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రసూతి సేవలను 24 గంటలు అందుబాటులో ఉండాలని, అందుకు అనుగుణంగా విధులకు హాజరు కావాలని సూచించారు. తమ తనిఖీల్లో గైర్హాజరు అయినట్లు గుర్తిస్తే షోకాజ్ నోటీసుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.